# సొమ్మొకడిది - సోకొకడిది

ఆదివారం మధ్యాహ్నం, భోజనానంతరం, టీవి చూస్తూ కూర్చున్నాడు విక్రమరావ్. డేవిడ్ నివన్ వేసిన పాత సినిమా వస్తున్నది. సౌత్ వెస్ట్ హ్యూస్టన్‌లోని, తన విశాలమయిన ఇంట్లో, ఫామిలీ రూమ్‌లో, రిక్లయినింగ్ ఛెయిర్‌లో పడుకుని, తాపీగా ఆదివారం గడపటానికి నిశ్చయించుకున్నాడు. ఎప్పుడో కానీ ఇలాటి అవకాశం దొరకదు. ప్రతి వీకెండ్‌లోనూ ఏదో పని. ఆఫీస్ పని, లేదా తోట పని. వాళ్లబ్బాయిని సాకర్‌కీ, గిటార్ క్లాసకీ; వాళ్లమ్మాయిని డాన్స్ క్లాసకీ, టెన్నిస్‌కీ - సునీతతో షాపింగ్‌కీ, వీక్ డేస్ కన్నా వీకెండే పని ఎక్కువ విక్రమరావ్‌కి.


సినిమా చూడటం ప్రారంభించిన ఐదు నిముషాలకే కునుకు పట్టింది విక్రమరావ్‌కి - సునీత అబ్బాయిని సాకర్ ప్రాక్టీస్ దగ్గర దించి, అమ్మాయిని సుబ్బారావ్‌గారింటికి తీసుకు వెళ్లింది. ఉగాది తెలుగు అసోసియేషన్ ప్రోగ్రాంకి - సునీత పాటలు పాడుతున్నది. వాళ్ళ అమ్మాయి ఒక తెలుగు జానపద గేయానికి నృత్యం చేస్తున్నది. అందుకే వాళ్లు వెళ్లేక, విక్రమరావ్‌కి కాస్త విశ్రాంతి దొరికింది ఈ ఆదివారం మధ్యాహ్నం.



సినిమా చూస్తూ, కునికిపాట్లు పడుతున్న విక్రమరావ్‌కి, ఏదో శబ్దం అయి హఠాత్తుగా మెలుకువ వచ్చింది. ఎదురుగుండా సోఫాలో కూర్చుని, బడ్‌వైజర్ బీరు తాగుతున్నాడు అమెరికా బేతాళుడు.

హాచ్చర్యపోయిన విక్రమరావ్ అన్నాడు "ఇంట్లో కూడా దాపురించావా భేతాళుడూ - కారులోనే ప్రత్యక్షమవటం నీ అలవాటనుకున్నాను."

బేతాళుడు నవ్వాడు - "నీకో మంచి కథ చెప్పాలనిపించింది. నువ్వేమో ఇవాళ బయటకు వచ్చే ప్రయత్నాలు చేయటం లేదు. ఇడియట్ బాక్స్ ముందు కూర్చుని పాత సినిమాలు చూస్తున్నావ్. ఏం చేయను? అందుకే నేను మీ ఇంటికి రావలసి వచ్చింది--"



"ఒట్టి కథ చెప్పడమేనా - మామూలుగా కథ చివరలో ప్రశ్నలడగటం - తెలిసీ జవాబు చెప్పకపోతే ---" అడిగాడు విక్రమరావ్.

"ఇది అమెరికా బేతాళుడి కథలలో ఐదవది. కనుక అన్ని కథలలో లాగానే, ఈ కథలో కూడా, చివరలో ఒక ప్రశ్న అడుగుతాను. నువ్వు జవాబు చెప్పాలి. చెప్పాలి ఏమిటలే చెబుతావు - నీకు అలవాటయిపోయింది కదా-"

"చెప్పకపోతే ఏమవుతుంది -- ఈసారి మనం కారులో లేము కదా - టైర్లు బ్రద్దలయి ఆక్సిడెంట్ అయి నా బుర్ర బ్రద్దలవటానికి" - నవ్వాడు విక్రమరావ్.

"హన్నా -- కారులో లేకపోతే ---" - కోపం వచ్చింది బేతాళుడికి - "నన్నే ఆటలు పట్టిస్తున్నావా - నీ ముప్పయి రెండు అంగుళాల స్టీరియో టీవి ఢామ్మని పగిలిపోతుంది - ఇక పాత సినిమాలు చూడటం కుదరదు - మళ్ళీ టీవి కొనేదాకా --"

"నీ దుంప పిలకెయ్యా - నా ఇంట్లోకి వచ్చి, నాకు కథలు చెప్పి, నన్నే బెదిరిస్తున్నావ్ -- నేను చెప్పను పో -- ఇంకెవడినన్నా వెతుక్కో!" కోప్పడ్డాడు విక్రమరావ్.

వెంటనే అన్నాడు బేతాళుడు - "బాబ్బాబు - అనగా అనగా పూర్వజన్మలో నువ్వు విక్రమార్కుడివి, నేను బేతాళుడిని. ఈ జన్మలో నువ్వు విక్రమరావ్‌వీ, నేను అమెరికా బేతాళుడిని - ఎప్పుడో, ఎక్కడో, ఎన్నడో విడిపోయాం. మళ్లీ ఎన్నోజన్మల తర్వాత, ఈ అమెరికా దేశంలో కలుసుకున్నాం. ఈనాటి ఈ బంధ మేనాటిదో - కనుక ఇక నాకేం చెప్పద్దు - విను నా కథ --" బేతాళుడు బ్రతిమిలాడుతున్నాడో, దబాయిస్తున్నాడో అర్థం కాలేదు విక్రమరావ్‌కి. ఈలోగా టీవిలో సినిమా కూడా అయిపోయి అమెరికన్ ఫుట్‌బాల్ గేమ్

మొదలయింది. విక్రమరావ్‌కి అమెరికన్ ఫుట్‌బాల్ అంటే నచ్చదు. అందుకే, టీవి ఆపేసి, బేతాళుడి కథ వినటానికి సిద్ధం అయ్యాడు.

"ఈ కథ అశోక్ చెబుతుంటే విన్నాను. పోయిన వేసం కాలంలో వాళ్లమ్మాయిని ఇండియా పంపించాడు ఆయన. మాతృదేశం వెళ్లి, బంధుమిత్రులను కలుసుకుని రావటానికి, మన వాళ్లకి అవకాశం దొరికేది ఐదారేళ్ల కొక్కసారి. మనిషికి పధ్నాలుగు - పదిహేను వందల డాలర్లు టిక్కెట్టుకే అవుతుంది. పైన ఇండియాలో తిరగటానికి, మనసారా తీసుకువెళ్లే బహుమతులు, మొహమాటానికి తీసుకువెళ్లే బహుమతులు --- అదో ఖర్చు. అదీకాక, ఇక్కడ శెలవులు, ఇండియాలోలా కాదు. మరీ తక్కువ. సంవత్సరానికి పది రోజులు మాత్రమే -- దాంట్లో ఇక్కడి అవసరాలకు వాడేవి ఎన్ని -- ఇండియా వెళ్లడానికి దాచుకునేవి ఎన్ని --"

"బేతాళుడూ - ఆపవయ్యా నీ సుత్తి - ఇవన్నీ నాకూ తెలుసు - నువ్వేం చెప్పఖ్ఖర లేదు - మేము కూడా ఐదారేళ్ళ కొకసారి వేళ్లే బాపతే! -- అసలు కథ కానీ --" అన్నాడు విక్రమరావ్ విసుగ్గా.

"సరే కానీ - అశోక్ వాళ్ళమ్మాయి అరవిందకి ఇండియాలో కజిన్స్‌నందర్నీ చూడాలనీ, తాజ్‌మహల్, జైపూర్, కన్యాకుమారి చూడాలనీ కోరిక పుట్టింది. పదహారేళ్ళ పిల్ల అడిగింది కదా, ఆ అమ్మాయి ఉత్సాహం ఎందుకు కాదనాలి అని, అశోక్ సరేనన్నాడు. వాళ్ళనీ, వీళ్ళనీ అడగ్గా, గోపాలస్వామి వాళ్ళావిడ కోయంబత్తూరు వెడుతున్నట్లు తెలిసింది. ఆవిడ్ని కనుక్కుని వెంటనే సింగపూర్ ఎయిర్‌లైన్స్ టిక్కెట్టు బుక్ చేశాడు - వాళ్ళతో పాటే - ఆస్టిన్ నుంచీ - -- మద్రాస్ దాకా ..."

"ఆస్టిన్ అంటావేమిటి - హిందీ సినిమాలో దర్శకుడి లోపంలాగా ...--

"కాదులే - ఈ అశోక్ వుండేది ఆస్టిన్‌లో. ఆయన అక్కడి తెలుగు సాంస్కృతిక సంఘానికి ప్రెసిడెంటు కూడాను. టిక్కెటు అయితే కొన్నాడు కానీ, ప్రయాణం ఇక పది రోజులే వుంది. రామకృష్ణారెడ్డిగారి భార్య అనసూయ నెల రోజుల తర్వాత ఎయిర్ ఇండియాలో వెడుతున్నది. ముందు ఆవిడతో పంపిద్దామనుకున్నాడు. అశోక్‌కి ఎయిర్ ఇండియా ఫ్లైట్ క్రూ అంటే ఇష్టమే! ముప్ఫయి ఏడు వేల అడుగుల ఎత్తులో, విదేశాల మీద ఎగురు తున్నప్పుడు, ఉప్మా, పూరీ, బంగాళదుంప కూర పెడతారు. చక్కగా మాట్లాడతారు. కానీ న్యూయార్క్‌లో, లండన్‌లో, బొంబాయిలో గ్రౌండ్ క్రూ మాత్రం మనుషులు కారు. వాళ్ళలో ఏ మాత్రం సభ్యత, సంస్కారం కనపడదు. ఈ పాసింజర్లు ఇచ్చే డబ్బుతోనే వీళ్లు రెండు పూటలా తిండి తింటున్న సంగతి మరిచిపోయి, తల పొగరుగా జవాబు చెప్పడం, ఏ మాత్రం సహాయం చేయకపోవటం వాళ్ళ జన్మహక్కులా ప్రవర్తిస్తారు ... సరిగ్గా జవాబు చెప్పరు. చెప్పినా హిందీలో ఏడుస్తారు ..."

"మళ్ళీ నువ్వు లూప్ లైన్‌లోకి వెడుతున్నావ్ బేతాళుడూ! అసలు కథ చెప్పు ..." - బేతాళుడిని అదలించాడు విక్రమరావ్.

"ఓకే - సింగపూర్ ఎయిర్‌లైన్స్ టిక్కెట్లు కొనేశాడు అశోక్, పదిహేను వందల డాలర్లు పెట్టి. ప్రయాణ సన్నాహాలు కూడా మొదలు పెట్టాడు - సూట్‌కేసులు కొనడం, బహుమతులు కొనటం, ఇండియన్ ముఖ్యులందరికీ ఫోన్ చేసి వివరాలు చెప్పటం, ఇండియన్ ట్రిప్‌లకు రిజర్వేషన్స్ చేయించటం .. అన్నీ చక చకా జరిగిపోతున్నాయి. అప్పుడే చూశాడు అరవింద ఇండియన్ పాస్‌పోర్టు. అది ఎక్స్‌పైర్ అయి నాలుగు రోజులయింది. ప్రయాణం ఇక ఎనిమిది రోజులే వుంది. వెంటనే ఇండియన్ కాన్సిలేట్, శాన్‌ఫ్రాన్సిస్కో ఆఫీస్‌కి ఫోన్ చేశాడు. రింగ్ అవుతుంది కానీ ఎవరూ తీయరు. ఒక అరడజన్ సార్లు ప్రయత్నం చేసిన తర్వాత, ఒకావిడ ఫోన్ తీసింది. అశోక్ చెప్పాడు ... పాస్‌పోర్టు రెన్యూవల్ కావాలని. "ఉత్తరం వ్రాయండి - ఫారం పంపిస్తాం. దాన్ని పూర్తిచేసి, మాకు పంపించండి. మూడు నాలుగు వారాల్లో రెన్యూ చేసి పంపిస్తాం!" అని ఠక్కున ఫోన్ పెట్టేసిందావిడ. అశోక్ బిత్తరపోయి మళ్ళీ ఫోన్ చేశాడు. (అమెరికాలో ఎవరూ, మాట్లాడుతూ అలా ఫోన్ పెట్టేయరు. అది అమర్యాదకు చిహ్నం). ఈసారి ఆవిడే మళ్ళీ ఫోన్ తీసింది. మర్యాదగా చెప్పాడు - "మాకు అంత టైమ్ లేదు. ఈ ప్రయాణం అంతా హడావిడిగా అరేంజ్ చేశాం.ఇందాకే చూసుకున్నాను - పాస్‌పోర్టు ఎక్స్‌పైర్ అయిందని -"

"ఆహా" చాలా కరుగ్గా అన్నది - "అంత గుడ్డిగా ఎట్లా వుంటారండీ - ముందే చూసుకోనక్కర్లే - పదిహేను వందల డాలర్లు పెట్టి టిక్కెట్లు కూడా కొన్నారు - ఇపుడు మీ అమ్మాయి పాస్‌పోర్టు లేక వెళ్ళలేకపోతే మా మీద పడి ఏడుస్తారు ..." అన్నది కొంచెం ఇంగ్లీష్‌లో, ఇంకొంచెం హిందీలో.

అశోక్‌కి ఆవిడ మాటతీరు కోపం తెప్పించింది. అయినా మర్యాదగానే అన్నాడు - "మీరు మాటలు ఎక్కువగా మాట్లాడుతున్నారు. కష్టమర్లే ముఖ్యం అనుకునే ఈ దేశంలో, కష్టమర్లతో ఇలా మాట్లాడటం బాగుండదు. నేను ముందరే చెప్పాను. అంతా హడావుడి అయిపోయిందని. ఇప్పుడు నేను మిమ్మల్ని పిలిచింది, క్షమాపణలు చెప్పటానికీ, బ్రతిమి లాడటానికీ కాదు. ఇద్దరం ప్రొఫెషనల్‌గా మాట్లాడదాం. నాకు పాస్‌పోర్టు వారం రోజుల్లోగా కావాలి. దానికి మీకేదయినా పద్ధతి వుందా? - త్వరగా ప్రాసెస్ చేయటానికి, ఏం చేయాలి? ఎంత ఎక్కువ ఖర్చు అవుతుంది? - చెప్పండి. అలా చేస్తాను. అంతేకానీ, నా ప్రవర్తన గురించి, నా మతిమరుపు గురించీ, నా గుడ్డితనం గురించీ మాట్లాడే హక్కు మీకు లేదు" - అన్నాడు.

ఆవిడ, "మీతో మాట్లాడే టైమ్ లేదు నాకు. పాస్‌పోర్టు పంపించండి - చూద్దాం" అని పెట్టేయబోతుంటే ఆపాడు అశోక్ - "మీ కాన్సులేట్ జనరల్‌తో మాట్లాడతాను. కనెక్షన్ ఇవ్వండి" అడిగాడు.

"ఆయన బిజీగా ఉన్నారు. కుదరదు" అని ఫోన్ పెట్టేసిందావిడ.

"వీళ్ళ ఆఫీస్ ఈ దేశంలో వున్నది - భారతీయులకు కావలసిన సహాయం చేయటం కోసం. వాటిలో పాస్‌పోర్టు రెన్యూవల్ ఒకటి. అది కూడా చేయటానికి ఇష్టం లేకపోతే,

వాళ్ళిక్కడికి వచ్చిందెందుకు? దేశాన్ని చూడటానికా? ఇంత అసహ్యంగా మాట్లాడవలసిన అవసరం వుందా? ఇక్కడ ఏ బాంక్‌కి వెళ్ళినా, ఆఫీస్‌కి వెళ్ళినా నవ్వుతూ పలకరించి ఎంతో సహాయం చేస్తారు. మన దగ్గర డబ్బులు తీసుకుంటున్నందుకు ప్రతిఫలంగా ఇస్తున్నారు ఆ సర్వీస్. అది మన వాళ్ళల్లో ఎందుకు కనపడదో" – 'సామ్మొకడిదీ, సోకొకడిదీ' అన్న సామెత గుర్తుకొచ్చింది అశోక్‌కు.

పదిమంది మిత్రులకు ఫోన్ చేశాడు అశోక్, ఈ పాస్‌పోర్టు ఉపాఖ్యానం ఎలా సుఖాంతం చేయాలా అని. చాలా మందికి ఇది సరిగ్గా లేదనీ, అది సరిగ్గా లేదనీ,త్రిప్పి పంపించారట. అంతేకాదు, ఇరవై అయిదు డాలర్లు కడితే, 24 గంటలలో పంపిస్తామని కూడా ఒక రూల్ పెట్టుకున్నారుట. ఆ మాట ఆ పాస్‌పోర్టు ఆవిడ ముందే చెబితే, తనకు ఇంత హైరాన వుండకపోను – పాస్‌పోర్టు అప్లికేషన్ కోసం ఎందరికో ఫోన్ చేయగా, ఆ వూళ్ళోనే వున్న ఒక సింధీ ఆయన దగ్గర ఫారం దొరికింది. అవన్నీ పూర్తి చేసి, మర్నాడు – శుక్రవారం – శాన్‌ఫ్రాన్సిస్కో ఆఫీస్‌కి ఫోన్ చేశాడు. ఈసారి ఫోన్ తీసినావిడ, అంత కర్కశంగా మాట్లాడలేదు. గవర్నమెంటు సర్వీస్‌లో కొత్తగా చేరినట్టుంది. తర్వాత రెండు రోజులూ శని, ఆదివారాలు. సోమవారం మెమోరియల్‌డే శెలవు – "పోనీ మంగళవారం పూర్తిచేసి పంపగలరా – మా అమ్మాయి శుక్రవారం వెళ్ళాలి" అన్నాడు అశోక్. "సారీ సర్ – మంగళవారం మహావీర జయంతి – మాకు శెలవు" అన్నదావిడ.

"ఓహో మీరు ఇండియా శెలవుల ప్రకారం ఆఫీస్ మూసేస్తారన్నమాట. అయితే సోమవారం మెమోరియల్ డేకి పని చేస్తున్నారా?" అడిగాడు అమాయకంగా.

"లేదండీ – మేము అటు ఇండియా శెలవులు, ఇటు అమెరికా శెలవులు, రెండూ వాడుకుంటాం. అందుకని బుధవారమే ఇక తెరవటం" అన్నది కూల్‌గా.

"బుధవారం పని పూర్తిచేసి, ఫెడరల్ ఎక్స్‌ప్రెస్ ఓవర్‌నైట్‌లో పడేయగలరా – గురువారం నాకు అందుతుంది – శుక్రవారం మా అమ్మాయి వెళ్ళాలి" అడిగాడు అశోక్.

"చెప్పలేనండీ – ప్రయత్నం చేస్తాం – పంపించండి – చూద్దాం" అని ఫోన్ పెట్టేసిందావిడ.

ఆ మాటే అశోక్, ఇందిరతో అంటే – ఇందిర సలహా ఇచ్చింది. "మన శుభ శాన్‌ఫ్రాన్సిస్కోలోనే కదండీ వున్నది. ఆవిడకు పంపిస్తే – పర్సనల్‌గా తీసుకువెళ్ళి, పని పూర్తి చేసుకుని, పంపిస్తుంది కదా ఆవిడ ..."

చాల క్లిష్ట పరిస్థితుల్లో మంచి సలహాలు ఇస్తుంది ఇందిర. 'కార్యేషు మంత్రి' అని వూరికే అనలేదు కదా! అందుకే భార్య తెలివితేటలకు మెచ్చుకుని – వెంటనే శుభకి ఫోన్ చేశాడు.

ఆవిడ అన్నది – "మీరేం కంగారు పడకండి. ఇవాళ శుక్రవారం కదా. నాకు రేపు

అందుతుంది, మీరు ఓవర్‌నైట్ మెయిల్‌లో పడేస్తే - బుధవారం నేను పొద్దున్నే వెళ్ళి, పని పూర్తి చేసుకుని ఆ రాత్రే మళ్ళీ ఓవర్‌నైట్ ఫెడరల్‌లో పంపిస్తాను. మీకు గురువారం అందుతుంది - శుక్రవారం అరవింద ఇండియాకు వెళ్ళవచ్చు --"

ఆవిడతో మాట్లాడిన తర్వాత ధైర్యం వచ్చింది అశోక్‌కు. ఆవిడ 'ఏమిటండీ - మీ మతిమరుపు' అని తిట్టలేదు. ఫలానా రోజుకి పాస్‌పోర్టు రావాలంటే, ఏం చేయాలా, ఎలా చేయాలా అనే ప్లాన్ చెప్పింది. ఇదే పని, పాస్‌పోర్టు ఆఫీస్‌లోని ఆవిడ చేయవలసింది. అది ఆవిడ వృత్తి ధర్మం. ఆవిడకు జీతం ఇస్తున్నదే అందుకు. అయినా ఆవిడ చేయలేదు. బహుశా గవర్నమెంటు ఉద్యోగం అనేసరికి ఆ కండకావరం వస్తుందేమో -

అశోక్ అన్నాడు శుభతో - "మరి మీరు హాస్పిటల్‌కి వెళ్ళఖ్ఖరలేదా - ఫరవా లేదా ..."

ఆవిడ నవ్వింది - "మాకు పని చాల ఎక్కువగా వుందండీ - అయినా మన అవసరం కదా తప్పదు - రెండు మూడు గంటల పని. ఆరోజు సాయంత్రం హాస్పిటల్‌లో ఎక్కువసేపు వుంటే సరి. ఇంకో డాక్టర్‌తో మాట్లాడి, ఇద్దరం వర్క్‌లో సర్దుకుంటాంలెండి" అన్నదావిడ. ఆవిడకు మనసారా కృతజ్ఞతలు చెప్పి ఆరోజే కాగితాలన్నీ శాన్‌ఫ్రాన్సిస్కో పంపించాడు అశోక్" - ఆగాడు బేతాళుడు.


విక్రమరావ్ అన్నాడు - "ఈ మన గవర్నమెంటు ఉద్యోగస్థుల్లో మార్పు ఎప్పుడు వస్తుందో - పోయినసారి ఇండియా వెళ్ళినప్పుడు పద్మనాభన్ ఒక పాకెట్, రిజిష్టర్ పోస్ట్‌లో మధురై పంపించమన్నాడు. గుంటూరు పోస్టాఫీస్‌లో నాకు అది పంపించటానికి ఆరు గంటల పైన పట్టింది. ముందు రిజిస్ట్రేషన్ లైన్లో నుంచోమన్నాడు. పదిహేను మంది వెనకాల నుంచుని, కౌంటర్ దగ్గరకు వెళ్ళేసరికి గంట పట్టింది. అతను రిజిష్టర్ చేయలేదు. బరువు తూచి, ప్రక్క లైన్లో నుంచుని స్టాంపులు కొనుక్కోమన్నాడు. అక్కడ ఇంకో గంట. స్టాంపులతను స్టాంపులు మాత్రమే అమ్ముతాడు. రిజిష్టర్ చేయడు. ఆ స్టాంపులంటించి మళ్ళీ రిజిస్ట్రేషన్ లైన్లో నుంచున్నాను. అది ఇంకో గంట. నా దగ్గరకు రాగానే, కౌంటర్ మూసేసి, భోజనం వేళయింది, ఒక గంట ఆగి రమ్మన్నాడు. గంట ఆగి వెళ్ళేసరికి, మళ్ళా లైను. పని పూర్తయే సరికి సాయంత్రం అయింది. ఈ దేశంలో అయితే పది నిముషాల్లో అయిపోయే పని అది. ఒకే క్లర్కు బరువు తూచి, స్టాంపులంటించి, రిజిష్టర్ చేసి, రిసీట్ ఇచ్చేస్తాడు. అక్కడ కాఫీ తాగుతూ కబుర్లు చెప్పడం ..." ఆపి, ఏదో ఆలోచిస్తూ అడిగాడు విక్రమరావ్ ... "ఇలా చెబుతూపోతే అంతం వుండదులే - సరే - ఇంతకీ ఏమయింది? - పాస్‌పోర్టు సమయానికి వచ్చిందా .."

"ఇంకొంచెం కథ చెప్పి, ఆ ప్రశ్న నేనే నిన్నడుగుతాను. జవాబు చెబుదువుగాని" అన్నాడు బేతాళుడు.

శుక్రవారం ప్రొద్దున పదింటికే శుభ ఫోన్‌చేసి, కాగితాలన్నీ అందాయని, బుధవారం

కల్లా పని పూర్తి చేస్తాననీ చెప్పింది. అశోక్ పనులన్నీ సవ్యంగా జరుగుతున్నందుకు సంతోషించాడు. బుధవారం వచ్చింది. మధ్యాహ్నం ఫోన్ మ్రోగింది. అనుకున్నట్టుగానే శుభ. కానీ అనుకున్నట్టుగా పని మాత్రం అవలేదు.

"ఈ క్లర్కుకి తలకాయ వుంది కానీ, దాన్లో ఏమీ వున్నట్లు లేదండీ - ఆ అప్లికేషన్ వెనకాల, ఇండియన్ కాన్సులేటు, న్యూయార్క్ వాళ్ళ రబ్బరు స్టాంపు వుందిట. అది ఇక్కడ శాన్‌ఫ్రాన్సిస్కో ఆఫీసులో పని చేయదట. ఆవిడ తిప్పికొట్టింది. ఇక్కడ ముద్ర వేసిన అప్లికేషన్ ఇచ్చింది. అది పంపించమంటుంది - ఇవాళ నేను మీకు అది పంపిస్తే, రేపు గురువారం



మీకు అందుతుంది ... మీరు గురువారం పంపిస్తే ... లేదులెండి అది జరిగే పనికాదు - మీ అమ్మాయి వెళ్ళేది శుక్రవారం కదా ..."

అశోక్ తల తిరిగిపోయింది. నెమ్మదిగా అన్నాడు - ..."ఐ డోంట్ నో వాట్‌టుడూ - ఈ రెండు అప్లికేషన్లలోనూ తేడా ఏమయినా వుందా?"

"లేదండీ - రెండూ అంతా ఒకటే - ఒకే ప్రింటు కూడాను. ఒక్క రబ్బరు స్టాంపు అడ్రస్‌లోనే తేడా వుంది - అంతే కాదు కాన్సలేట్ జనరల్‌ని చూస్తానన్నాను. వాళ్ళు నన్ను ఆయన దగ్గరకు పోనివ్వలేదు - ఆయన బిజీగా వున్నాట్ట!"

"వీళ్ళకి బుద్ధి లేకపోతే సరి - మనల్ని అనవసరంగా ఇబ్బంది పెట్టటం కోసం వీళ్ళు జీతాలు తీసుకుంటున్నట్టున్నారు. ఉండండి - లెట్ మి థింక్ ..." ఆగాడు అశోక్.

బేతాళుడు కూడా ఆగాడు - "ఇప్పుడు చెప్పు విక్రమార్కుడూ - అశోక్ ఏం ఆలోచించాడు? శుభ ఎలా విజయం సాధించింది? అరవింద ఇండియా వెళ్ళగలిగిందా? ... ఆలోచించు - తెలిసీ జవాబు చెప్పకపోతే ..."

"ఆగు బేతాళుడూ... ఆగు అంతదాకా అఖ్ఖర్లేదు జవాబు ఇస్తాను ... " సాలోచనగా అన్నాడు విక్రమరావ్.

టీవిలో సీకో రిస్ట్‌వాచ్ అడ్వర్ట్‌యిజ్‌మెంటు వస్తున్నది. తెల్లవారుఝామున ఒక కోడి లేచి కర్రల మీదుగా నడుచుకుంటూ వచ్చింది. చుట్టుతా చూసింది. అక్కడే ఒక కర్ర మీద సీకో వాచ్ పెట్టి వుంది. కోడి ఆ టైము చూసింది. పెద్ద ముల్లు పన్నెండు మీదకు రాగానే 'కొక్కురోకో' అని కూసి వెనక్కి వెళ్ళిపోయింది. వెనకాల నుంచీ ఒక గొంతు - రోజూ, ప్రతి రోజూ సీకో గడియారాలు, టైము కరెక్టుగా చూపిస్తాయని చెబుతున్నది.

"గివ్ అప్?" అడిగాడు బేతాళుడు.

విక్రమరావ్ నవ్వాడు - "అశోక్ ఆస్టిన్ తెలుగు అసోసియేషన్ ప్రెసిడెంటు అన్నావు కదా - జవాబు దొరికిందిలే."

"అయితే చెప్పు" అడిగాడు బేతాళుడు.

"వస్తున్నా - అశోక్ చాల ఉత్సాహంగా, ఎన్నో తెలుగు ప్రోగ్రాంలు ఇచ్చాడు ఆస్టిన్‌లో - అప్పుడే ఇండియా నుంచి వస్తున్న ఆర్టిస్టులకు, ఇండియన్ గవర్నమెంటు కొన్ని గ్రాంట్లు ఇచ్చింది. ఆ విషయంలో, కొంతమంది తెలుగు ఆర్టిస్టుల వీసాల సంబంధంగా ఇండియన్ కాన్సులేట్ జనరల్‌గారు, శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి అశోక్‌ను చాలాసార్లు పిలిచి, ఎంతో ఇన్‌ఫర్‌మేషన్ అడిగారు. అశోక్, ఆయనకు అన్ని విషయాల్లోనూ, వెంటనే ఎంతో సహాయం చేశాడు. హఠాత్తుగా అశోక్‌కి అనిపించింది. ఆయన్నే పిలిచి మాట్లాడితే - అని.

వెంటనే ఫోన్‌లో పిలిచాడు.

"ఆయనతో మాట్లాడటానికి వీలులేదు - ఆయన ఎప్పుడూ బిజీ" అన్నది క్లర్క్, రికార్డెడ్ మెసేజీలాగా.

"లేదు - ఆయనకు నేను కొంచెం ఇన్‌ఫర్‌మేషన్ ఇవ్వాలి. ఆయనే అడిగారు నన్ను" అన్నాడు అశోక్. ఇంతకు ముందు కూడా అలా అడిగితేనే కనెక్షన్ ఇచ్చేరు వాళ్ళు.

వెంటనే కనెక్షన్ ఇచ్చింది ఆవిడ. ఆయన వెంటనే అశోక్ గొంతు గుర్తుపట్టారు. "వాట్ కెన్ ఐ డు ఫర్ యూ!" అన్నారు.

అశోక్ జరిగిందంతా చెప్పాడు - "ఈ ప్రయాణం చాలా హఠాత్తుగా ప్లాన్ చేయవలసి వచ్చిందండీ - అందుకే పాస్‌పోర్టు చూడలేదు ముందుగా - తీరా వెళ్ళకపోతే ఎయిర్ ఫేర్ అంతా వృథా అవటమే కాకుండా, ఇండియాలో చేసిన అరేంజిమెంట్లు, రిజర్వేషన్లూ వృథా అవుతాయి - మా అమ్మాయి కూడా డిజపాయింట్ అవుతుంది" అపాలజటిక్‌గా చెబుతున్నాడు అశోక్.

"మీరవన్నీ చెప్పఖ్ఖర్లేదండీ - మనం ఎంత జాగ్రత్తగా వున్నా - ఇలాంటివి జరుగుతూనే వుంటాయి. మనం చూడవలసింది, ఈ పరిస్థితుల్లో పని ఎలా పూర్తిచేయాలా అని - అంతే కాని - ఇలా ఎందుకు అయింది అని కాదు - అందుకే, మాకు వెంటనే ఒక రోజులో ఇచ్చే పద్ధతి కూడా వుంది - అయినా మా వాళ్ళల్లో కొంతమందికి బుద్ధిలేదు లెండి - రబ్బరు స్టాంపు సరిగ్గా లేదని, అప్లికేషన్ త్రిప్పిపంపుతారా - న్యూయార్క్ ఆఫీసుకానీ, శాన్‌ఫ్రాన్సిస్కో ఆఫీసు కానీ అన్నీ ఇండియన్ గవర్నమెంటువే - బుర్రల్లేకుండా ప్రవర్తిస్తారు అప్పుడప్పుడూ. మీ స్నేహితురాల్ని వచ్చి నన్ను కలవమనిచెప్పండి - వెంటనే ఇచ్చేస్తాను" అన్నాడాయన.

అశోక్ - ఆయన సహాయానికి కృతజ్ఞతలు చెప్పి వెంటనే శుభకు ఫోన్ చేసి చెప్పాడు. తర్వాత ఒక గంటలో మళ్ళీ ఫోన్ కాల్ వచ్చింది శుభ దగ్గరనుంచి. ఆయన వెంటనే పని పూర్తిచేశాడనీ, ఫెడరల్ ఎక్స్‌ప్రెస్ ఓవర్‌నైట్‌లో పంపిస్తున్నాననీ, దిగులుపడవద్దనీ - చెప్పింది శుభ. సో ... శుభ వల్ల ఈ కథకి శుభం అయింది. లేకపోతే 'భశుం' అయుండేది ..." అన్నాడు విక్రమరావ్.

అమెరికా బేతాళుడు, విక్రమరావ్ జవాబుకి ముక్కు మీద వేలు వేసుకుని, వింతగా చూడబోయి - తలుపు దగ్గర గంట మ్రోగితే - అందరికీ కనపడటం బాగుండదని - వెంటనే మాయమయాడు.

❖